క్లుప్తంగా

ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లకు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యుత్ అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ వరంగల్‌కు నూతనంగా నియమితులైన డైరెక్టర్లు వి.మోహన్‌రావు, ప్రభాకర్‌రావు, తిరుపతిరెడ్డిలను శుక్రవారం వరంగల్ సంస్థ కార్యాలయంలో ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డీఈలు హీరాలాల్, వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత

నేలకొండపల్లి: కార్మికుల జీవితాలను, భవిష్యత్‌ను నాశనం చేసిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 9న సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసు అందించారు. లేబర్ కోడ్ల రద్దు కోసం నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు బి.కోటేశ్వరీ, చెరుకు శ్రీను, చల్లగుండ్ల నాగయ్య, బి.ఆంజనేయులు, ప్రకాష్, బొడ్డు పుల్లయ్య, స్టాలిన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుమలాయపాలెం: మండలంలోని కేశ్వాపురంలో తిరుమలాయపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యాన శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు అవినాష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

28న మాజీ ప్రధాని పీవీ జయంతి

ఖమ్మం మామిళ్లగూడెం: భారత మాజీ ప్రధాని పీ.వీ.నర్సింహారావు 104వ జయంతిని ఈనెల 28న ఖమ్మం వివిధ బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు నియోగి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు చాగంటి రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదుట గల ఆయన విగ్రహం వద్ద ఉదయం 9.30 గంటలకు, ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ సర్కిల్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండకు చెందిన డి.రమేష్ కనపడకుండాపోవడంతో ఆయన సోదరుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. ఈనెల 10న ఇంటి నుంచి వెళ్లిన రమేష్ తిరిగిరాకపోగా, ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో ఆయన సోదరుడు పోలీసులను ఆశ్రయించాడు.కాగా, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడుకు చెందిన రమేష్ కొన్నేళ్లుగా మంచుకొండలో ఉంటున్నాడు.

నీరుగారుతున్న లక్ష్యం..



అండర్ డ్రైయినేజీ నిర్మాణానికి చేపట్టిన తవ్వకాలు

నత్తనడకన అండర్ డ్రైయినేజీ నిర్మాణ పనులు

- నెలదాటినా జోరందుకోని వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వ్యాపారులు

ఖమ్మంక్రైం: నగరంలోని త్రీటౌన్ పరిధిలోని ప్రధాన రహదారి అయిన హర్కార బావి సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహం ముందు అండర్ డ్రైయినేజీ పనులు ప్రారంభించారు. ఇందుకోసం రోడ్డు మధ్యలో భారీ తవ్వకం చేపట్టగా.. పనులు నత్తనడక సాగుతున్నాయి. దీంతో ఆప్రాంతవాసులతో పాటు వాహనదారులు, చిరువ్యాపారులు తీవ్రఇబ్బంది పడుతున్నారు. వర్షాలు ముదిరితే మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

నెలరోజులు దాటినా..

రైల్వే మూడో లైన్ కోసం మోహన్‌రోడ్ నుంచి మధ్య గేట్ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా డ్రెయినేజ్ కోసం సుందర్ టాకీస్ పక్కనుంచి పాత వెంకటలక్ష్మి థియేటర్ ప్రాంతం వరకు కాల్వ నిర్మాణ పనులను ప్రారంభించారు. నెల రోజుల క్రితం గుట్టలబజార్ ప్రాంతం నుంచి గాంధీచౌక్ ప్రధాన రహదారి రాజీవ్‌గాంధీ సెంటర్ మధ్యలో భారీ తవ్వకాలు చేపట్టారు. దీంతో ప్రతి రోజూ ఈ ప్రాంతం గుండా వెళ్లే వేలాదిమంది హర్కారబావి సెంటర్, సీఎస్ఆర్ రోడ్డుమీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అసలే నిత్యం ట్రాఫిక్ ఉండే ఈరోడ్డు కాస్తా ఇంకా ట్రాఫిక్‌గా మారింది.

స్తంభించిన వ్యాపారాలు..

రోడ్డు మధ్యలో భారీ తవ్వకాలు చేపట్టి నత్తనడక పనులు సాగుతుండడంతో గాంధీచౌక్ వరకు వ్యాపారాలు దాదాపు స్తంభించిపోయాయి. ఇక్కడ జరిగే చిరు వ్యాపారాలైన టిఫిన్, స్నాక్స్, జ్యూస్‌ల అమ్మకాలు జోరుగా సాగుతుండగా.. వీటికోసం వన్‌టౌన్, త్రీటౌన్ ప్రాంతాల నుంచి గుట్టలబజార్ మీదుగా కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. అయితే ఈ రోడ్డులో కాల్వ తవ్వడంతో చుట్టూ తిరిగి వెళ్లడానికి ప్రజలు అంతగా ఆసక్తి చూపకపోవడంతో వ్యాపారాలు దెబ్బతిన్నట్లయింది. అలాగే ఈ ప్రాంతంలో నివసించే వారు తమ ఇళ్లల్లోకి వెళ్లేందుకు కాల్వపై చెక్కలు వేసుకుని గత నెల రోజులుగా వెళ్తూ నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలు ముదరకముందే అండర్ డ్రెయినేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఇళ్ల ముందు చెక్క ర్యాంపులు

త్వరగా పూర్తి చేయాలి



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద అండర్ డ్రెయినేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు మొదలై నెలరోజులు దాటినా పనుల పూర్తికాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. వానలు ముదిరితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

– కూడలి సురేందర్, వాహనదారుడు

స్కూల్‌కు వెళ్లాలంటే ఇబ్బంది..



పిల్లలు స్కూల్‌కు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఓ స్కూల్ ముందు కాల్వ తవ్వడంతో చెక్కలపై నుంచి వెళ్లి రావడానికి భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా పనులు త్వరగా పూర్తి చేయాలి.

– మురజెల్లి శ్రీనివాస్, స్థానికుడు

వ్యాపారాలు తగ్గాయి..



అండర్ డ్రెయినైజీ కోసం రోడ్డు మధ్యలో తవ్వడంతో వ్యాపారాలన్నీ పడిపోయాయి. గత నెల రోజులుగా చిరు వ్యాపారులు కొట్టుమిట్టడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పనులు పూర్తి చేసి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలి.

– దామళ్ల సూర్య, వ్యాపారి

దివ్యాంగుల హక్కుల సాధనకు ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న చలమయ్య

నేలకొండపల్లి: దివ్యాంగుల హక్కుల సాధన కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమించాలని భారత తెలంగాణ దివ్యాంగుల సమితి, టీడీ జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య పిలుపునిచ్చారు. మండలంలోని పైనంపల్లిలో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు సీట్లు కేటాయించాలని కోరారు. కార్యాలయం నిర్మాణానికి కేటాయించిన స్థలంలో భవన నిర్మాణానికి సమష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, సంఘం జేఏసీ నాయకులు రామకృష్ణ, చారి, వెంకటేశ్వర్లు, సైదా, బ్రహ్మం, సఫియా, రాము, భద్రయ్య, వెంకన్న, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

3, 4వ తేదీల్లో విద్యా సంస్థలు బంద్



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యార్థుల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జులై 3, 4 తేదీల్లో ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ విద్యా సంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మందా సురేష్, జిల్లా గరల్స్ కన్వీనర్ పైండ్ల శ్యామల, నాయకుడు బొడ్డు రాములు తెలపారు. శుక్రవారం ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీ జీఎన్ఆర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత కొన్ని నెలలుగా విద్యార్థి సంఘాలు, విద్యార్థులు వివిధ రూపాల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తులు తేస్తున్నా బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్పందన, నందిని, శ్రీనివాస్, మహేష్, జంపన్న, చరణ్, సాయి, సోహెల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలో వసతులపై సర్వే

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ ఇందిరానగర్ పీహెచ్‌సీసబ్ సెంటర్‌లో ఉన్న సౌకర్యాలపై ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని స్టాఫ్, మందులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి మాట్లాడుతూ.. దవాఖానా పరిధిలో 10వేల మంది జనాభా వరకు ఉన్నా అందుకు సరిపడా సిబ్బంది, మందులు లేవని, చిన్న గదిలోనే విద్యుత్ సౌకర్యం లేకుండా వైద్య సేవలందిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి సిబ్బంది పెంపుతో పాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.



సర్వే చేస్తున్న ఐద్వా కమిటీ సభ్యులు

ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు పందుల నాగమణి, కత్తుల అమరావతి, తాళ్లపూడి మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరదలపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాకాలంలో సంభవించే వరదల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు ప్రజలను కాపాడేందుకు అన్ని వేళల సిద్ధంగా ఉండాలని ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 46వ డివిజన్‌లో ఆపద మిత్ర, వలంటీర్లకు వరదలపై అనుసరించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వం సూచనల ప్రకారం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సహాయకరంగా ఉండాలని వలంటీర్లకు సూచించారు. అనంతరం కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ మాట్లాడుతూ.. గతేడాది వచ్చిన మున్నేరు వరదలతో పడిన అవస్థలు మరలా పునరావృతం కాకుండా డివిజన్లలో ఆపదమిత్రలు, వలంటీర్ బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆపద మిత్రలు వరదల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో శిక్షణ తీసుకొని సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ తేజస్విని, టీపీబీఓ ప్రవీణ్, వార్డ్ ఆఫీసర్ ఉపేందర్, జవాన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై..

కూసుమంచి: మండలంలోని కొత్తూరు గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ వాణి మాట్లాడుతూ.. ఈ పద్ధతి ద్వారా భూమికి నీటిని నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుందని, నాణ్యమైన, కలుషితం లేని ఆహారం లభిస్తుందన్నారు. అందుకు జీవన ఎరువులు, గోమూత్రం, వేప సంబంధిత కషాయాలు, వర్మి కంపోస్ట్ వంటివి వినియోగించాలన్నారు. అధికంగా యూరియా వాడకం వలన కలిగే అనర్థాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సౌమ్య, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై..

రఘునాథపాలెం: విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మల్లేపల్లి, గడ్డికుంటతండా, బావోజీతండా గ్రామాల్లో పర్యటించారు. డీఈ బాబురావు, ఏడీ సంజయ్‌కుమార్, ఏఈ సతీష్ ఆధ్వర్యాన పలుచోట్ల కిందకు ఉన్న విద్యుత్ లైన్లను గుర్తించి సరిచేయాలని సిబ్బంది సూచించారు. ఆతర్వాత రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యుత్ సంబంధిత సమస్యలు ఎదురైతే సిబ్బందికి సమాచారం ఇవ్వాలే తప్ప సొంతంగా మరమ్మతులు చేయొద్దని సూచించారు. అలాగే, మోటార్లు, సర్వీస్ వైర్లు నాణ్యమైనవి అమర్చుకోవాలని తెలిపారు. మాజీ సర్పంచ్ బండి వెంకన్న, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కరివేద సాగు విధానంపై..

కామేపల్లి: వరి కరివేద సాగు విధానంతో రైతులకు అధిక ప్రయోజనాలు చేకూరుతాయని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని జాస్తిపల్లి గ్రామంలో పొలంలో నేరుగా వెదజల్లే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. దీని ద్వారా ఖర్చు తగ్గడంతో పాటు కూలీల సమస్య ఉండదని, చెరువు ఆయకట్టు కింద సాగుకు అత్యంత అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కొరివి మోహన్‌రావు, నల్లమోతు రవి, దిరిశాల జనార్ధన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం మళ్లీ వాయిదా

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయానికి చెందిన 13.20 ఎకరాల భూములకు శుక్రవారం దేవాలయ ఆవరణలో వేలంపాట నిర్వహించేందుకు సిద్ధమవగా.. స్థానిక రైతులు నిర్వహించనీయలేదు. రూ.కోట్ల విలువైన భూములను కొంతమంది పెద్దలు ఆక్రమించుకున్నారని, ఆ భూమిని స్వాధీనం చేసే వరకూ వేలం పాట జరపొద్దని అడ్డుకున్నారు. భూమి కబ్జాకు గురైనప్పటికీ రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు మీనమేషాలు లెక్కవేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని రైతులు నిలదీశారు. కాగా, ఎన్ఓసీ లేకుండా అనుమతులు ఇస్తున్నారని సంబంధిత అధికారులు చెప్పడంతో స్థానిక రైతులు పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయ భూములకు హద్దులు తెల్చాలని గత నాలుగు నెలలుగా అధికారులకు దరఖాస్తులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. పది రోజుల్లో సర్వే చేసి రిపోర్టు ఇస్తామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అల్లం రవి చెప్పి వెనుదిరగడంతో మూడోసారీ కూడా వాయిదా పడింది. ఆలయ భూమి కోసం న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని రైతులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జమలాపురం దేవస్థానం ఈఓ కె.జగన్‌మోహన్‌రావు, దేవాదాయ శాఖ అధికారులు శ్రీనివాస్, మురళీ, రైతు ప్రతినిధులు వంగవీటి నాగేశ్వరరావు, కొండలు, పసుమర్తి శ్రీనివాస్, జెర్రిపోతుల అంజిని, కృష్ణారావు, దాసరి రామారావు, కాసాని లింగయ్య, కడియాల నరేష్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

కర్రలే ఆధారమై..



మండలంలోని పుటానితండాలో విద్యుత్ లైన్‌కు స్తంభాలు లేకపోవడంతో రైతులు అమాంతం కర్రలతో నిలబెట్టిన పరిస్థితి ఉంది. వ్యవసాయ పనుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉండడంతో కర్రలు పాతి వాటికి తీగలను కట్టి నిలబెట్టారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున పనులకు ఆటంకం కలగకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ లైన్‌పై నాలుగు డీడీలు తీసి నెలలు దాటినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే శాశ్వత విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈవిషయమై రఘునాథపాలెం విద్యుత్ ఏడీ సంజయ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఆ లైన్ తమ పరిధిలో లేదని, విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

– రఘునాథపాలెం

మేయర్, కమిషనర్‌ను కలిసిన ఏఎంసీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా విధుల్లో చేరిన అనిల్‌కుమార్ శుక్రవారం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏఎంసీకి పలువురు ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

యూనిఫామ్ పంపిణీ

కేఎంసీ కార్యాలయంలో హౌజ్ కీపింగ్ సిబ్బందిగా పని చేస్తున్న వారికి మెప్మా ఆధ్వర్యాన అందజేసిన యూనిఫామ్‌ను మేయర్ పునుకొల్లు నీరజ అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ సుజాత పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న చైర్మన్ హన్మంతరావు

కామేపల్లి: కొండాయిగూడెం సొసైటీ సభ్యుడైన మండలంలోని రుక్కితండా గ్రామానికి చెందిన జాటోత్ భీముడు ఇటీవల మృతి చెందాడు. ఇతడు గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించుకోవడంతో మంజూరైన రూ.50 వేల చెక్కును అతడి భార్య బుజ్జికి సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుగులోత్ సక్రాంనాయక్, డైరెక్టర్లు అంబడిపూడి వెంకటేశ్వర్లు, దండగల దేవేందర్, దొడ్డ మల్లేష్, ఐతనబోయిన విఠల్‌రావు, సీఈఓ దొడ్డ ముత్తయ్య పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలు మూసివేయాలి..



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: అనుమతులు లేకున్నా ఉన్నట్టు చూపిస్తూ అధికారులను తప్పిదోవపట్టిస్తున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ చాంబర్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ఫైర్ సేఫ్టీ, శానిటరీ, క్రీడామైదానం వంటి సౌకర్యాలు సౌకర్యాలు లేకుండానే పాఠశాల నిర్వహణకు రెన్యువల్ పర్మిషన్ పొందారని, ఇది విద్యాశాఖ ఇచ్చే అనుమతులకు పూర్తిగా విరుద్ధమన్నారు. తక్షణమే తనిఖీ నిర్వహించి అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్, వంశీ, మనోజ్, పవన్, గోపి, రాహుల్, లక్ష్మణ్, సాయి, నరేందర్, మహేష్ ,ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని సొసైటీ చైర్మన్ గూడవల్లి రాంబ్రహ్మం సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చేసిన అభివృద్ధి పనులను ఇంటింటికీ చేరవేస్తూ సర్పంచ్‌తో పాటు మూడు ఎంపీటీసీలను గెలిపించుకోవాలని, అందుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. వార్డుల వారీగా ముఖ్యలతో సమావేశం నిర్వహించి, ఎన్నికలకు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ గుడిపాటి ముక్కంటి, నాయకులు గుండా బ్రహ్మం, వీరభద్రం, కైలాసపు వెంకటేశ్వర్లు, రాంబాబు, రాయపూడి శ్రీనివాసరావు, వాసు, గోవింద్, రాంభాస్కర్, నరేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అక్రమ అరెస్టు గర్హనీయం

రఘునాథపాలెం: చాలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసు అధికారులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య ఒక ప్రకటనలో ఖండించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం తలపెట్టగా.. సమస్యల పరిష్కారం కోసం సామరస్యంగా పోరాటం సాగిస్తున్న కార్మికులను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడిగా భావించాలి. ప్రజాస్వామ్యవాదులంతా దీన్ని ఖండించాలని, ఇటువంటి చర్యలను వెంటనే నిలిపివేయాలని, కార్మికులపై అక్రమ కేసులను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం..

యూటీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న నాయకులు

కూసుమంచి: పాలేరు వద్ద సాగర్ ఎడమకాలువకు నిర్మిస్తున్న యూటీ (అండర్ టన్నెల్) పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘ నాయకులతో కలిసి యూటీ నిర్మాణ పనులను పరిశీలించి పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నాక వారు మాట్లాడారు. వర్షాకాలం మొదలైనా ఇప్పటి వరకు పనులు ఇంకా పూర్తిచేయకపోతే పంటలకు సాగునీరు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక మంత్రిని, అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిక్కసాని గంగాధర్, చింతనిప్పు చలపతిరావు, దుగ్గి కృష్ణ, తూళ్లూరి నాగేశ్వరరావు, మల్లెల సన్మంతరావు, తోటకూరి రాజశేఖర్, రాధాకృష్ణ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.2 కోట్ల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరయ్యాయి. ఇందులో అనాసాగారంలో సీసీ రోడ్లకు రూ.12 లక్షలు, అప్పలనరసింహాపురంకు రూ.14 లక్షలు, కోనాయిగూడెంకు రూ.21లక్షలు, చెన్నారం పంచాయతీకి రూ.22 లక్షలు, చెరువుమాధారం పంచాయతీకి రూ.20 లక్షలు, గువ్వలగూడెం రూ.30 లక్షలు, సధాదాశివాపురం పంచాయతీకి రూ.20 లక్షలు, సుర్దేపల్లి పంచాయతీకి రూ.8 లక్షలు, నాచేపల్లి పంచాయతీకి రూ.23 లక్షలు, నేలకొండపల్లి పంచాయతీకి రూ. 30 లక్షల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నేలకొండపల్లి మేజర్ పంచాయతీ 11వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలను మంజూరు చేయించిన ఎంపీ రఘురామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాంక్ ఖాతాదారులకు ఉత్తమ సేవలు



బీమా చెక్కు అందిస్తున్న మేనేజర్ నాగరాజు

కామేపల్లి: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందిస్తున్నామని, బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం రీజనల్ మేనేజర్ ఎస్.నాగరాజు అన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ను పండితాపురంలో నూతన భవనంలోకి మార్చగా.. శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పంట రుణాలు, మహిళా రుణాలు తీసుకున్న వారు క్రమం తప్పకుండా సకాలంలో చెల్లించాలని, బ్యాంక్ ద్వారా అందించే బీమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన అనుమంచినేని నరసింహారావు ఇటీవల మరణించగా.. మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును అతడి భార్య కృష్ణవేణికి, మహిళా డ్వాక్రా గ్రూప్ సభ్యులకు రూ.1.55 కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ పి.శ్రీనివాసరావు, ఫీల్డ్ ఆఫీసర్ నవీన్ ప్రకాశ్, అకౌంటెంట్ ప్రణీత్, క్యాషియర్ ఉపేంద్రమ్మ, ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి..

ఖమ్మం మామిళ్లగూడెం: భారత విప్లవ పంథాకు తుది మెరుగులు దిద్దిన ఉద్దాంతుడు, మాజీ రాష్ట్ర కార్యదర్శి డీ.వీ.కృష్ణ మూడో వర్ధంతి సభ శుక్రవారం ఖమ్మం స్థానిక రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంథా రూపొందించుకోవడమే నిజమైన శాస్త్రీయ సోషలిజమని చాటిన అగ్రనాయకుడు కృష్ణ అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆవుల వెంకటేశ్వర్లు, అశోక్, ఝాన్సీ, శిరోమణి, శోభ, శ్రీను, లెనిన్, సత్తార్, ఆజాద్, వెంకటేష్, చందు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.